# సైకిల్ సవారీ

ఆర్ పద్మనాభం

చిన్నప్పటినుంచి నాకు ఆశ్చర్యం, కుతూహలం, ఇంకా చెప్పాలంటే గౌరవంకూడా కలిగించిన వస్తువొకటి వుందంటే అది సైకిలే; మా హెడ్‌మేష్టారి వాహనం. వారు సైకిల్ వాహనులై కచ్చాజండా ఎగరేసుకొంటూ సర్రుమని స్కూల్ ఆవరణలో ప్రవేశించి జామ్మని దిగుతారు. అప్పుడు నాకొక్కడికే కాదు, పిల్లలందరి మనస్సుల్లోనూ వారొక గొప్పవ్యక్తిగా కనిపిస్తారు. ఒక అద్భుతుడైన మహనీయుణ్ణి చూసినట్టు అందరూ గప్ చిప్ అయిపోతారు.

ఎందుకంటే, ఆరోజుల్లో అందరికీ సైకిలు లేదు. సైకిలు పెట్టుకొన్న ఎవరో ఒకరిద్దరు పెద్దలకు మాత్రమే గౌరవం ఉండేది. అందరూ సాధించలేని ఏదో మహత్కార్యం వారు సాధించినట్టు మాకు తోచేది. తోచదా మరి ? ఎంతటి విచిత్రవాహనమో చూడండి: నిలబెట్టితే అది నిలువదు- నిండా పదేని బిడ్డలాంటిది. తేలికైన నాజూకైన చట్రంపైన, దానికన్నా రెండు మూడింతలు బరువుగల మానవుడు ఎక్కేస్తే, తక్షణమే అతి సుళువుగా పరుగెత్తడమే దానిపని ! ఎంత బరువైనా కొంచెంకూడ లక్ష్యం లేనట్టు. దానిమానాన అది సాగుతూ వుంటే, మనకెంత వేగం కావాలో మన పాదాల సైగ తెలుసుకొంటూ అంత పరిమితిలోనే పోతుందికదా! అవసరమైన వంకర టింకరలు, మెళుకువలు, లీలావినోదమైన నాగనడకే. నాబోటి పాదచారులు తమపైకి వస్తుందేమో అనుకొని భయపడితే అది "టుంగ్" అని కింఖిణిగొంతుతో నవ్వేసి పారిపోతుంది. ఎటువంటి అపాయమూ లేకుండా సుళువుగా దూరిపోతుంది. చూస్తే కర్రలాంటి వాహనం! దీనిశక్తి ఎంత! సాహసమెంత! కార్లూ బస్సులూ అయితే వాటికి ఒక ఇంజనూ, నోరూ, తిండీ అన్నీ

కావాలి. వాటి మోతలు, హోరులు చెప్పతరంకాదు; గూబ బద్దలవుతుంది.

కాని మన సైకిలుకి కావలసిందల్లా వట్టిగాలే. పురాణకాలంలో వాయు భక్షణంతో జీవించిన ఏ ఋషో ఏదో కర్మం లోపించి సైకిలై పుట్టి ఇలా మానవసేవచేస్తున్నాడు కాబోలు పాపం!

సైకిలంటే మహా గొప్ప అనుకున్నాను మొదట్లో. దాన్నిగురించి నాలాంటి బీదలు తలచటానికే వీలు లేదనుకొన్నాను. సైకిల్ ప్రయాణమంటే ఒక సర్కసుఫీటు, లేదా కత్తిమీద నాట్యం అనుకున్నాను ఆ రోజుల్లో.

నేను పెద్దయిన కొద్దీ తోడివాళ్ళల్లో నేను ప్రత్యేకించి విడిపోతున్నట్టు లోలోనే నొచ్చుకొన్నాను. నాకన్న చిన్న చిన్న కుర్రాళ్ళు కుక్కను చెవిపట్టి లాగినంతసులువుగా సైకిలును లాక్కుంటూవచ్చి దానితో ఆటలాడుతూండడం చూశాను. వాళ్లు తమ తమ ఇష్టానుసారంగా సైకిల్‌ను పరుగుతీయిస్తున్నారు. సైకిలును లొంగతీయడమంటే ఏదో పెద్ద డిగ్రీ సంపాదించేటంత పని అని నేను అనుకొంటూవుంటే, ఈ కుర్రకుంకల చేతిలో అదెంతటి అల్పవస్తువై పోయింది! బెదిరిస్తే ఊరుకునే కుక్కలాగా సైకిలు కుర్రాళ్ళచేతిలో వాళ్ళ యిష్టంప్రకారం పడివుంటుందికద! కుక్కలు మానవులకు స్నేహమయినట్టే సైకిలున్నూ. అలా అయితే నాకుమాత్రం ఎందుకు వశ్యంకాదూ? ప్రపంచం ముందుకు పోతూంటే నేను వెనకపడి పోవడమా! చెప్పరాని బాధ కలిగిందినాలో.

ప్యూన్ రాముడు నాకు స్నేహితుడైయాడు. అప్పుడు నేనొక మేష్టార్ని. రాముడికి, వాడి ఆఫీసు సైకిలు వాడి ఇష్టప్రకారం సేవ చేస్తూఉండేది. ఒక్కొక్కసారి నేను ఎక్కడికైనా బయలుదేరడం వాడు చూస్తే "మేష్టారూ, కావలిస్తే నా సైకిలు తీసుకుపొండి" అనేవాడు. పాపం. నాకు సైకిలురాదని వాడికి తెలీదు.

"వద్దులే, నేను ఎప్పుడు తిరిగొస్తానో తెలీదుగా, నీకుమళ్ళీ ఆఫీసు పనికి ఇబ్బంది అవుతుంది" అనేవాణ్ణి. ఎవరితోనూ నాకు సైకిలు రాదని అనిపించుకోకుండా జాగ్రత్తగా ఉండేవాణ్ణి. మనిషన్న వాడికల్లా సైకిలు రాగా, నాకు రాదంటే సిగ్గుకదూ?

ఇలా ఎంతకాలం?

రాముడు ఎన్నోమాట్లు చెప్పేవాడు; "ఇంటినుంచి మైలుదూరం పైగా వుందే. ఎందుకు బాధపడుతారు

మేష్టారూ, ఒక సైకిలు కొనుక్కుంటే ఎంతహాయి! డబ్బుపోతే పోయింది" • "అదే, దాన్నిగురించే ఆలోచిస్తున్నాన్రా. తీస్తే కొత్తదే తీయాలి. దేనికైనా డబ్బుండొద్దూ? అరువు బేరం నాకొద్దురాబాబూ" అన్నాను మహాసైకిలు వీరుడిలా.

మేం చూస్తూండగానే ప్ర్యాన్ రాముడు సొంతసైకిలు సంపాదించేశాడు. నాకన్నా కిందవాళ్ళు ఎందరో సొంతసైకిల్ - సెకండ్ హాండ్ గానీ, థర్డుహాండుగానీ - కొని, రాజుల్లాగా సవారీచేస్తూంటే నేను మట్టుకు ఇంకా హైదర్ కాలంనాటి హాడిలాగా కాలి నడకతోనే కాలం గడుపుతున్నానే! ఛ! బాగులేదు!.

ఏ విద్యయినా గురుముఖంగా నేర్చుకోవాలంటారు. మరి సైకిలు విద్యకు ఆ శాస్త్రమేమీ లేదట. కారు డ్రైవింగుకు శాస్త్రం, నియమం ఉన్నట్టు సైకిలుకు ఏమీ లేదంటున్నారు- సైకిలువేత్తలు

"పట్టాను, ఎక్కాను, పెడల్ తొక్కాను; సర్రుమని ముందుకు పోయింది, అంతే." అని ఒకడంటే "నాకు ఒక్కగంటలో వచ్చేసింది ఈ సైకిల్ సవారీ." అంటాడు ఇంకొకడు."నా సైకిలు మీద మా అబ్బాయి అయిదేళ్ళవాడు పరుగెడతాడు" అని మరొకడు. "సైకిలుకేముందిరా,మనం తొక్కితేచాలు,మంత్రించినట్టు పరుగెత్తుతుంది." అంటాడు ఇంకో ప్రజ్ఞావంతుడు.

సైకిలు వీరులు ఇలాంటి మాటలు చెప్పగా చాలా చాలా విన్నాను. అటువంటప్పుడు "నాకు కాస్త సైకిలు నేర్పుతావా?" అని ఒకళ్ళని అడగడమంటే ఎంత సిగ్గు!

ఒకనాడు ప్ర్యాన్ రాముడు మా ఇంట్లో సైకిలుపెట్టి భోజనానికి కాబోలు - పోయాడు. ఆ వేళ ఆదివారం. అతగాడి భోజనం నిద్ర అయి తిరిగి వచ్చేటప్పటికి సాయంత్రం నాలుగు గంటలయినా అవుతుందని నాకు తెలుసు.

ఇంటిముందు నిలబెట్టివుంచిన సైకిలును ఒకే చేతితోపట్టి ముందుకు తోశాను. అదే మొదటితూరి నేను సైకిలు తాకటం . కాళ్ళురాని శిశువులాగా సైకిలు దిబ్బున కింద పడింది. దానిమైన నేనూ బోర్లపడ్డాను.

దీనికి జీవం ఉందా? బుద్ధిబలం ఉందా? కొత్తమనిషి తాకినాడని సిగ్గు పడుతుందా? లేదా మొండితనం చేస్తూందా? ఏమీ అర్థంకాలేదు.

లేచిచూశాను. దానికేమీ దెబ్బ తగల్లేదు. నాకూ అట్టే ఏమీ కాలేదు. ఏదో వున్నా భయపడితే ఎలా?

ధైర్యమేతోడు. "జై హనుమాన్" అంటూ దాన్ని పైకి ఎత్తి నిలబెట్టేను. నిలిస్తేగా? నడుం సత్తువలేని ముసిలాడి లాగా అటూ ఇటూ పడబోయింది. హయ్యో! దాని అబలాత్వం చూసి నాకు నవ్వొచ్చింది కూడా. ఏమైనా సరేనని చెంగుపట్టి లాగేశాను కదా; ఇక తెగింపే

దాన్ని బలంగా ముందుకు నెట్టుతూ హనుమంతుడిలా ఎగిరి సీటుపై గురిగా నడుంవుంచాను. తర్వాత ఏం జరిగిందో ఏమిటో సైకిలు ముందుకు పరుగెత్తటం, నేను వెనుక్కి లాగటం, అది పక్కకి వాలటం, నేను పల్లంలో పడటం, సైకిలు కూడా దొర్లిదొర్లి ఇంకోచోట పడుకోవటం-అన్నీ గబగబా జరిగాయి. ఈ సందడికి రామూ నిద్రలేచి వచ్చేశాడు.

ఇప్పుడు రాముడికి అసలు సంగతి తెలిసిపోయింది ముఖంఎత్తి వాణ్ణి చూడలేక పోయాను. సైకిలు కూడా కొంచెం రిపేరిలో పడింది. అయినా ఏదో సర్దిపుచ్చి వాడికిచ్చేశానను కోండి.

"చ ఛ, ఈ రోజుల్లో సైకిలు రాదంటే చాలా సిగ్గుచేటు మేష్టారూ. ఉండండి. మీకు నేను క్షణంలో నేర్పుతాను." అన్నాడువాడు. "వద్దులే. దేవుడిచ్చిన కాళ్ళుండగా సైకిలు దేనికి రామూ? సైకిలు సవారికైనా కాళ్ళు ఉపయోగించక తప్పదుమరి. దీనివల్ల గుండెజబ్బు వస్తుందని డాక్టర్లంటూ రాయె'' అన్నాన్నేను

''అవన్నీ ఉత్తమాటలండీ. ఆ మాటకొస్తే ఏది చెడ్డది-కానిది ? మీరే చెప్పండి. మనలాంటివాళ్ళకు కాదు ఆ మాటలు. సమయానికి సైకిలు ఎంత ఉపయోగపడుతుందో! ఒక గంటలో మీకు నేర్పితే సరికద ?"

రాము నన్ను విడువలేదు. ఆవేళ రాత్రి వెన్నెల్లో మైదానానికి వెళ్ళాం. ఒకే వేలుతో సైకిల్ను నెట్టుకుపోతున్న రాముడి నేర్పు చూసి ఆశ్చర్యపోయాను. వాడు నన్ను సైకిలుపై కూర్చోబెట్టి, ''ఇలా తొక్కండి హేండిల్ వదులుగా పట్టుకోండి. ముందుకు చూడండి" అంటూ నాకు చెప్పి చెప్పి నానా యాతనపడి చెమటకారిపోయాడు. ఒక గంట కాదు, మూడు గంటలు కాదు, మూడు రోజులైనా నాకు సైకిలు లొంగలేదు. ''మేష్టారూ, ఇది చెబితే వచ్చే విద్య కాదండీ. స్వతహా మీకే ఆసక్తి ఉంటేనే వస్తుంది." అనేసి రాముడు నన్ను వదులుకొన్నాడు.

ఇలా సైకిలుకూ నాకూ దూరమైపోయినా, ఈమూలకంగా రాముడు నాకు చాలా దగ్గరైనాడు. అప్పటి

ంచి వాడు నాతో అంతో ఇంతో డబ్బు బదిలీ వ్యవహారానికి దిగాడు కడాన రాముడు నాకు ముప్ఫై రూపాయిలదాకా ఇవ్వవలసి తేలాడు.

అంతలో వాడి కేదో గట్టిఅవసరం వచ్చిపడింది వాడు ఆ ఊరే వదలి దూరం పోవలసినస్థితి ఏర్పడింది పోతే వాడికున్న సొత్తల్లా ఆ సైకిలొక్కటే అందుచేత వాడు ఆ సైకిలు తెచ్చి నా ముందు పెట్టి, "మేష్టారూ, మీకు నేను ముప్ఫై రూపాయలివ్వాలి కదా? ఇది మంచి జర్మన్ రావెట్ సైకిలు దొంగాడి చేతికిచ్చినా నూరు రూపాయలొస్తాయి మీరు దీన్ని తీసుకొని పైన నాకో ముప్ఫైరూపాయ లివ్వండి చాలు" అన్నాడు

అలాగే చేశాను ఇలా ముందు నేనొక సైకిలుకు యజమానినైనా అప్పుడు సహజంగానే నాకు పట్టుదల పుట్టుకొచ్చింది రాత్రంతా వెన్నెల మైదానంలో నేను సైకిలుతో యుద్ధం చేయనారంభించానన్నమాట అదేం మాయో తెలీదు సైకిలు సవారీ దానంతటదే వచ్చేసింది-ఎవళ్లూ నేర్పకుండానే! ఉత్సాహంతో జోరుగా ఇంటికి వస్తూంటే, గేటుదగ్గిర టర్నింగులో నేనూ నా సైకిలూ పల్లంలో పడ్డాం నాకేం దెబ్బతగల్లేదనుకోండి, కాని సైకిలుమట్టుకు అష్టవంకరలుగా తిరిగిపోయింది హేండిల్ వంగింది, ఫెడల్ విరిగింది, చైను కత్తిరించుకుపోయింది, స్పోక్స్ ఊడివచ్చాయి ఒక చక్రం వంగింది, మడ్ గార్డ్ గుద్దుకుపోయింది, బెల్లు ఎగిరి ఎక్కడో పడింది ఇంతెందుకూ, మొత్తం సైకిలే మరణశయ్యలో పడింది నా సరదా చచ్చింది రెండోవాడి చేతిలో భ్రష్టురాలైన పతివ్రత ఆత్మహత్య చేసుకుంది!

ఆ శవాన్ని మోసుకుపోయి ఒక సైకిల్ షాపులో పడేశాను దానికి షాపువాడు ఇరవై రూపాయలిచ్చాడు ఆ డబ్బు పూటబత్తెంకింద ఆ షాపువాడికే అందించి, అద్దె సైకిలు తీసుకొని సైకిలు సవారీలో మంచి నిపుణత్వం సంపాదించుకొన్నాను కాని సొంతసైకిలు లేదు ఇంకెప్పుడు కొంటానో? కొనగానే మీ అందరిళ్ళకి కొత్త సైకిల్ మీదనే వస్తానుగా! ★

---

## సినిమా క్విజ్ - జవాబులు

1 పదండి ముందుకు· 2. ఎదురీత.